క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఉశేన్‌స్వామి ఉరుసు



దర్గాలో గంధం నిర్వహిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో వెలసిన ఉశేన్‌స్వామి దర్గాలో బుధవారం నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 526వ ఉరుసును మూడు రోజులపాటు నిర్వహిస్తుంచనున్నారు. మొదటి రోజు దర్గాలో గంధం(సొందల్) కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఉరుసు(మేలా) నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లి గఫార్‌మియా తెలిపారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

గర్భిణులకు అవగాహన సదస్సు

కోవెలకుంట్ల: గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ కెన్నెడి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ సూచించారు. పౌష్టికాహార పక్షత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఆరు, ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లులు,గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, తదితర పోషకాలు కలిగిన ఆహారం తినడం వల్ల తల్లి, బిడ్డకు శ్రేయస్కరమన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు పాల్గొన్నారు.

రోగులకు టీబీ నిర్ధారణ పరీక్షలు



రోగికి మ్యాన్‌టోక్స్‌పరీక్ష నిర్వహిస్తున్న హెల్త్‌సూపర్‌వైజర్ మునిస్వామి

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రోగులకు టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి తెలిపారు. గతంలో క్షయ సోకి చికిత్స పొందుతున్న రోగుల కుటుంబ సభ్యులు, రోగికి దగ్గరగా ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి మ్యాన్‌టోక్స్ పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. టీబీ రోగులకు దగ్గరగా ఉన్న వ్యక్తులు విపరీతమైన దగ్గు, గల్ల, తదితర లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్లను స ంప్రదించాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయిన వ్యక్తులు క్రమ తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మునిస్వామి, ఏఎన్‌ఎం జ్యోతి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కోవెలకుంట్ల: ప్రకృతి వ్యవసాయం అన్ని విధాలా లాభదాయకమని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ప్రకృతి వ్యవసాయ ప్రణాళికపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయంలో ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారన్నారు. వీటి వల్ల ఆహార ధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు కలుషితం కావడమేకాకుండా భూమి సారం తగ్గిపోతోందన్నారు. రైతులను ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వెలుగు ఏపీఎం శేఖర్, ఎస్ఎఫ్ఈ రామకృష్ణ, మాస్టర్ ట్రైనర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

డోన్ టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా, రహదారులు, పింఛన్లు, విద్యుత్, వైద్యం తదితర సమస్యలపై అధిక వినతి పత్రాలు వచ్చాయి. అనంతరం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి 75 మందికి మంజూరైన రూ. 1,11,28,338 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

16న జాబ్‌మేళా

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం విడుదల చేయించారు. అమె మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీల ప్రతి నిధులు పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.




పార్కులో పేరుకు పోయిన చెత్త



పార్కులో మరమ్మ తులకు నోచు కోని విద్యుత్ మోటార్

కళతప్పుతున్న ఉద్యానవనాలు

డోన్: స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఏపీ – స్వచ్ఛ డోన్ అనే కార్యక్రమం కాగితాలు, నాయకుల మాటలకే పరిమితమయ్యాయి. ఒకప్పుడు పచ్చదనం పరిశుభ్రతతో కళకళలాడిన డోన్‌లోని పలు పార్కులు నేడు ఆలనాపాలనా లేక వెలవెలబోతున్నాయి. సిబ్బంది, నిధుల కొరత అంటూ పచ్చగా ఉన్న పార్కులను ఎండుగడ్డి కేంద్రాలుగా మార్చేశారు. ప్రతిరోజూ బోరుకు మోటార్ వేసి పార్కుల్లోని గడ్డి, మొక్కలకు నీరు అందించాల్సి ఉండగా.. సిబ్బంది కొరతతో మున్సిపల్ అధికారులు ఆ పనిని మానుకున్నారు. దీంతో కేవీఎస్ పార్కుతో పాటు 1వ సచివాయలం సమీపంలోని పార్కులో పచ్చదనం మచ్చుకు కూడా కనిపించడంలేదు. అపరిశుభ్ర



కేవీఎస్ పార్కులో ఎండిపోయిన మొక్కలు

వాతావరణం నెలకొనడంతో వాకర్స్ కూడా పార్కులకు రావడం మానేశారు. నిర్వహణ లేక మరుగుదొడ్లు, మూత్రశాలలు తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇక్కడ ఉన్న మోటార్లు మరమ్మతులకు నోచుకోక మూలక పడివున్నాయి. అధికారులు స్పందించి పార్కులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనంతో కళకళలాడేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను సంప్రదించగా.. త్వరలోనే తగినంత సిబ్బందిని నియమించి పార్కుల ఆలనాపాలనా సక్రమంగా జరిగేలా చూస్తామని వివరించారు.



సచివాలయం పార్కులో నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు

పరామర్శ



ఇక్బాల్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె : పట్టణంలోని కొండపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సునార్ ఇక్బాల్ ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సునార్‌ఇక్బాల్ నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం కుదుటపడటంతో ఇటివల ఇంటికి చేరుకున్నారు.

రక్తదానం

డోన్ టౌన్: ప్యాపిలి మండలం అలేబాద్ గ్రామానికి చెందిన గీత అనే గర్భిణికి రక్తం అవసరం కావడంతో ద్రోణాచలం సేవా సమితి అధ్యక్షుడు షాదీఖానా రాజా రక్తదానం చేశారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణికి బుధవారం ఏ పాజిటివ్ రక్తంను అందించి మానవత్వం చాటుకున్నారు. తాహేర్, ఫయాజ్‌బాబా, చిన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా

కోవెలకుంట్ల: సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా అవుతుందని, గృహ వినియోగదారులపై ఆర్థికభారం తగ్గుతుందని డోన్ ఆర్డీఓ నరసింహులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఆర్డీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తూ ఈ పథకం వర్తింపునకు వినియోగదారులకు సబ్సిడీపై సోలార్ యూనిట్లు సరఫరా చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు ఉచితంగా, ఇతర వినియోగదారులకు సబ్సి డీపై యూనిట్లు కేటాయిస్తోందన్నారు. సూర్యఘర్ యోజన పథక అమలు, విధివిధానాలను తెలియజేశారు. మండల ప్రత్యేక అధికారి సోమశివారెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, ట్రాన్స్‌కో ఏఈ అనంతరావు పాల్గొన్నారు.



బనగానపల్లెలో మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహులు

బనగానపల్లె రూరల్ : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఆర్డీఓ నరసింహులు సూచించారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ విద్యుత్ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సోలార్ రూఫ్ టాప్‌కు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గానికి 10వేల రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారని పేర్కొన్నారు. బనగానపల్లె మండలానికి సుమారు 2,500 వరకు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈఈ మద్దిలేటి,ఏఈలు శ్రీనివాసులు,గర్జప్ప, సర్పంచ్ ఈసారి యల్లమ్మ,ఉపసర్పంచ్ బురానుద్దిన్,తహసీల్దార్ నారాయణరెడ్డి,ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హోరా హోరీగా బండలాగుడు పోటీలు

బేతంచెర్ల: పట్టణ సమీపంలో వెలసిన చౌడేశ్వరీ దేవి తిరునాలను పురస్కరించుకొని స్థానిక శేషారెడ్డి హైస్కూలు మైదానంలో పాల పండ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. బుధవారం ఉదయం పారిశ్రామిక వేత్తలు, ఆలయ కమిటీ సభ్యులు గౌరి హుస్సేన్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఆయా ప్రాంతాల నుంచి 7 జతల వృషభాలు పాల్గొనగా.. హోరా హోరీగా సాగిన పోటీల్లో తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూలు జిల్లా అక్షరారెడ్డి వృషభాలు ప్రథమ, బేతంచెర్ల మండలం వైబీ శేఖర్ రెడ్డి ద్వితీయ, బేతంచెర్ల మేకల భానుజ 3వ స్థానం, ఉయ్యాలవాడ మండలం, నర్సిపల్లి గ్రామం ఉప్పర లక్ష్మిదేవి 4వ, బనగానపల్లె మండలం, రామకృష్ణాపురం 5వ స్థానంలో నిలిచాయి. వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.50 వేలు, రూ 40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10వేలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఘురామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, మద్దయ్య, రామస్వామి, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల విజేత బీ తాండ్రపాడు

మండలపరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా పాల పండ్ల వృషభాలకు బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీల్లో కర్నూలు మండలం, బీ తాండ్రపాడు వరలక్ష్మి వృషభాలు ప్రథమ, నంద్యాల మండలం, గుండం చెన్నారెడ్డి ద్వితీయ, వైఎస్సార్ కడప జిల్లా వంశీయాదవ్ తృతీయ, బేతంచెర్ల మండలం మేకల భానుజ వృషభాలు 4వ స్థానం కైవసం చేసుకున్నాయి. దాతల సహకారంతో వీరికి వరుసగా రూ. 25 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు అందజేశారు. అలాగే గుండు, పరుగు పందెం పోటీలను నిర్వహించారు. 135 కేజీల గుండు పందెంలో ప్యాపిలి మండలం మాధవ వరం రాజశేఖర్ ప్రథమ, డోన్ మండలం గోసానిపల్లె వేణు గోపాలు ద్వితీయ, ప్యాపిలి మండలానికి చెందిన రంగస్వామి తృతీయ స్థానంలో నిలువగా వారికి వరుసగా రూ. 3వేలు, 2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులు అందజేశారు. పరుగు పందెం పోటీల్లో సిద్ధనగట్టు నవీన్, ఆర్ బుక్కాపురం తలారి హరీశ్ ప్రథమ, ద్వితీయ, కోడుమూరు శివ తృతీయ స్థానం కైవసం చేసుకోగా రూ. 2వేలు, రూ. 1500, రూ. 500 నగదు బహుమతులను గ్రామ సర్పంచ్ నాగరాజు అందజేశారు.



బేతంచెర్లలో బండ లాగుతున్న వృషభాలు



ఆర్ బుక్కాపురంలో 135 కేజీల గుండును అవలీలగా ఎత్తిన మాధవ వరం రాజశేఖర్

ఆయిల్‌పామ్ సాగుతో బహుళ ఆదాయం

సంజామల: ఆయిల్‌పామ్ పంట సాగుతో పాటు అంతర్ పంటలు వేసుకోవడం వల్ల రైతులు బహుళ ఆదాయం పొందవచ్చునని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి చెన్నయ్య అన్నారు. మండలంలోని నొస్సం గ్రామంలో పతంజలి ఫుడ్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌ఫామ్ పంట సాగుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లడుతూ..ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులకు ఉచితంగా ఎకరాకు 57 మొక్కలు అందిస్తామన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసుకున్నందుకు ఎకరాకు సంవత్సరానికి రూ.10,500 ప్రభుత్వం నుంచి వస్తుందని చెప్పారు. నాటుకున్న నాలుగో సంవత్సరం నుంచే గెలలు వస్తాయన్నారు.ఇలా 25 సంవత్సరాలు గెలలు వస్తాయన్నారు.దాదాపు సంవత్సరానికి రూ.1.50 లక్షలు ఆదాయం వస్తుందని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆసక్తిగల రైతుల మండల ఉద్యాన శాఖ అధికారులను కలవాలని సూచించారు. కోవెలకుంట్ల డివిజన్ వ్యవసాయ అధికారి సుధాకర్, ఉద్యాన శాఖ అధికారి రఘువరన్, పతంజలి ఫుడ్ లిమిటెడ్ కంపెనీ జిల్లా మేనేజర్ మహదేవ్ పాల్గొన్నారు.



మాట్లడుతున్న చెన్నయ్య

పోలీసులకు టోపీలు, కంటి అద్దాలు



పోలీసులకు కంటి అద్దాలు, టోపీలు, వాటర్ బాటిల్స్ అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల : పట్టణ మెడికల్ షాపు అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంపుల్లయ్య, దామోదర్ ఆధ్వర్యంలో సీఐ డీ. వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్ బాబు చేతుల మీదుగా పోలీసులకు, టోపీలు, కంటి అద్దాలు, వాటర్ బాటిళ్లను బుధవారం అందజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని విధి నిర్వహణలో పోలీసులకు సౌకర్యంగా ఉండేందుకు తమ వంతు తోడ్పాటు అందించినట్లు మెడికల్ షాపు అసోషియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మల్లికార్జున, కౌశిక్, శ్రీధర్, సంజీవ రాయుడు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్యం

డోన్ టౌన్ : ఇంటి పెరటిలోని ఔషధ మొక్కలు, వంట గదిలోని పోపుల పెట్టెలోని దినుసులతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించ వచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ వీరాచారి, వృక్షశాస్త్రం విభాగం అధిపతి స్వరూపరాణి, అధ్యాపకులు షాలీసాహెబ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఔషధ మొక్కల ప్రాముఖ్యత, ఆరోగ్య సూత్రాలు అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణ్ పఖ్వాడా



మాట్లాడుతున్న సీడీపీఓ షంషాద్‌బేగం

డోన్ రూరల్ : పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం ఆధ్వర్యంలో పోషణ్ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఎక్కువగా పోషకాహారం తీసుకోవాలన్నారు. కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా మానసికంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చెన్నకేశవులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శకుంతల, పద్మావతి, శోభరాణి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పురాతన భవనం కూల్చివేత

కోవెలకుంట్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో నూతన భవనానికి నిధులు మంజూరు కావడంతో బుధవారం పురాతన భవనం తొలగింపు పనులు చేపట్టారు. సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం కావడంతో కార్యాలయ గదులు పూర్తిగా దెబ్బతిని వర్షానికి కారుతూ, పైపెచ్చులూడి పడుతుండటంతో కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. పాత భవనం స్థానంలోనే కొత్త భవనం ఏర్పాటు కావాల్సి ఉండటంతో కార్యాలయాన్ని తొలగిస్తున్నారు.



ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

చంద్రా రాజేశ్వరరావుకు నివాళి

డోన్ రూరల్: పట్టణంలోని నక్కి రామన్న భవనంలో బుధవారం సీపీఐ పట్టణ సహా య కార్యదర్శి రామ్మోహన్ ఆధ్వర్యంలో చంద్రా రాజేశ్వరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజినేయులు హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణ, పులిశేఖర్, పృథ్వీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్డీఓ నరసింహారెడ్డి

బేతంచెర్ల : పట్టణంలోని 1, 5వ గ్రామ సచివాలయాలను డీఎల్డీఓ నరసింహారెడ్డి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. జియో ట్యాగింగ్, ఆధార్ లేని పిల్లలను గుర్తించి నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను వేగవంతం చేయాలన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి

అవుకు: మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పావని అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం రామాపురంలోని అంగన్‌వాడీ సెంటర్–2లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించాలంటే పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవటమే కాకుండా వైద్యుల సూచనలు పాటించాలని గర్భిణులు, బాలింతలకు తెలియజేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో అందజేసే పౌష్టికాహారం కిట్లను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఏఎన్‌ఎం వెంకటేశ్వరమ్మ, సిబ్బంది రాజేశ్వరి, సుధామలలిత పాల్గొన్నారు.

గ్యాస్ ధరలను తగ్గించాలి

బేతంచెర్ల : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం మండల, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మధు శేఖర్, సీనియర్ నాయకులు ఎల్లయ్య అన్నారు. బుధవారంపట్టణంలోని పాత బస్టాండులో సీఐటీయూ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కట్టెల పోయిపై వంట చేస్తూ, సిలిండర్లతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కి గ్యాస్ సిలిండర్లపై రూ. 50 పెంచి ప్రజలపై భారం మోపారన్నారు.

డోన్ టౌన్ : వంట గ్యాస్ సిలిండర్‌పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు అక్బర్ బాషా, హరి, అశోక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

ఏఈ పోస్టును భర్తీ చేయరేమీ?

- ఐదు నెలలుగా విద్యుత్ ఏఈ పోస్టు ఖాళీ
- అవుకు ఏఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు

కొలిమిగుండ్ల: విద్యుత్ శాఖలో ఐదు నెలలుగా ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ ఏఈగా పని చేసిన ప్రసన్న వెంకటేష్ బదిలీపై ఎమ్మిగనూరుకు ఐదు నెలల క్రితం వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇక్కడికి కొత్త వారిని నియమించలేదు. ప్రస్తుతానికి అవుకు ఏఈ ఫక్కీరయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే అక్కడి ఒత్తిడి కారణంగా ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తనను తప్పించాలని ఆయన ఉన్నతాధికారులను కోరినట్లు తెలుసింది. మండలంలో పాలిష్ ప్యాక్టరీలు, నాపరాతి గనుల్లో విద్యుత్‌తో పని చేసే కోత మిషన్‌లు అధికంగా ఉన్నాయి. ప్రతి నెలా గృహాలు, కేటగిరి–2, పరిశ్రమలకు సంబంధించి రూ.2 కోట్ల మేర విద్యుత్ బిల్లుల రూపంలో వసూలు చేయాల్సి ఉంది. రెగ్యులర్ ఏఈ లేక పోవడంతో వినియోగదారులతో పాటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా కనెక్షన్‌లు తదితర వాటి కోసం అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తుంది. కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, చింతలాయిపల్లె, తిమ్మనాయినపేట, కనకాద్రిపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. ఏవైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే వాటి పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఏఈ అందుబాటులో ఉంటే సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని, రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదని, అలాగే సిబ్బంది పనితీరు సరిగా లేదని ప్రజలు పేర్కొంటున్నారు. కాగా..ఇక్కడికి ఏఈగా వచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

హాస్టళ్ల తనిఖీ

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలను ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కస్తూర్బా బాలికల ఉర్దూ రెసిడెన్సియల్ పాఠశాలలో వంటశాలలను తనిఖీ చేసి మెనూను పరిశీలించారు. విద్యార్థినుల అడిగి మెనూ పాటిస్తున్నారా లేదా, భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఎస్సీ బాలికల వసతి గృహం, బీసీ బాలికల వసతి గృహాలను తనిఖీ చేసి కూరగాయలు, బియ్యం,కందిపప్పు తదితర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా 94905 51117 అనే నంబరకు వాట్సాప్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు. కాగా తనిఖీపై ముందుగానే అన్నిశాఖల అధికారులకు తెలియడంతో వసతి గృహాల అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. తహసీల్దార్ నారాయణరెడ్డి,ఎంపీడీఓ వెంకటరమణ,ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు, కేజీబీసీ ప్రిన్సిపాల్ సునీత,సీడీపీఓ ఉమామహేశ్వమ్మ ఉన్నారు.



బనగానపల్లెలో విద్యార్థినులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కోవెలకుంట్ల: అనంతపురం జిల్లా ముదిగుబ్బ వీఆర్ఏ ప్రసాద్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో పనిఒత్తిడి కారణంగానే ప్రసాద్ మృతి చెందాడన్నారు. వీఆర్ఏ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించి ఆ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించడంతోపాటు ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.